## ఫ్రేమ్ - 21

### పాపం రిక్షావాడు

'ఏయ్ రిక్షా ....వస్తావా?'

ఫుట్‌పాత్ మీంచి లావుపాటాయన అరిచాడు.

'వస్తాను బాబయ్యా....' అంటూ రిక్షా వాడు లావుపాటాయన దగ్గరికి పరుగున రిక్షా లాక్కుని వచ్చాడు.

'ఎక్కడికి వెళ్ళాలి బాబయ్యా?'

'స్టేట్‌బ్యాంక్ కాలనీయా బాబయ్యా?.... నిజంగానా బాబయ్యా..... అక్కడిదే కదా బాబయ్యా?..... సత్తె ప్రయాణికంగానే బాబయ్యా.... ఎక్కండి బాబయ్యా....' హడావుడిగా సీటు దులిపాడు రిక్షా వాడు.

లావుపాటాయన అనుమానంగా రిక్షా వాడిని చూశాడు.

'నేను స్టేట్ బ్యాంక్ కాలనీకి వెళ్తే నీకెందుకంత సంతోషం?'

రిక్షా వాడు అటు తిరిగి నాలుక కొరుక్కుని ఇటు తిరిగి నవ్వాడు.

'హి..... అక్కడ నా ఎంకి ఉంది బాబయ్యా.....'

'ఉ.....సరే. ఎంతో కొంత అడుగు.... లేకపోతే దిగింతర్వాత అంతివ్వు ఇంతివ్వు అని గొడవపెట్టుకుంటావు.....'

'ఫర్లేదు బాబయ్యా.... మీరెంతిస్తే అంత తీస్కుంటాను'

'నీతో లాభంలేదుగానీ వేరే రిక్షా చూసుకుంటాను.....' అంటూ రెండడుగులు ముందుకు వేశాడు లావుపాటాయన.

'వద్దుబాబయ్యా.... నా రిక్షా నే ఎక్కండి బాబయ్యా.... అయిదు రూపాయలివ్వండి బాబయ్యా..... బతిమాలాడు రిక్షా వాడు.

'అయిదు రూపాయలెందుకూ?.... మూడు రూపాయలిస్తాను'

'అలాగే బాబయ్యా.....' సీటు దులిపాడు రిక్షా వాడు.

లావుపాటాయన రిక్షా ఎక్కాడు.

కాస్త దూరం వచ్చాక రిక్షా వాడు ప్రశ్నలేయడం మొదలపెట్టాడు.

'బాబయ్య.... మీరు అదే కాలనీలో ఉంటారా బాబయ్యా.....?'

'అవును ఏం....?'

'మీ ఇంట్లో ఎంతమంది ఉంటారు బాబయ్యా?'

లావుపాటాయనకి అనుమానం వచ్చింది. ఇలా నెమ్మదిగా ఇన్‌ఫర్‌మేషన్ లాగి రాత్రిపూటో లేదా పగలు ఇంటిదగ్గర మగాళ్ళు లేనపుడు ఇల్లంతా దోచుకుంటారు......

'మా ఇంట్లో ఎంతమందుంటే నీకెందుకూ?'

'ఊర్కే అడుగుతున్నాను బాబయ్యా.... తొక్కేటపుడు ఇలా ఊసులాడ్తు వుంటే అలసట తెలీదు కదా బాబయ్యా .... చెప్పబడి బాబయ్యా.....'

'మా ఇంట్లో చాలా మందిమి ఉంటాంలే ..... రాత్రిపగలూ.... ఎప్పుడు మగాళ్ళం ఎవరో ఒకరు ఇంటిదగ్గర ఉంటాం.....'

'మీ ఇంటిదగ్గర ఎప్పుడైనా దొంగలు పడ్డారా బాబయ్యా?' అడిగాడు రిక్షా వాడు.

అంతే లావుపాటాయనికి పూర్తిగా అనుమానం వచ్చింది. 'విడి ప్రశ్నలకి సమాధానం ఇవ్వకూడదు' అనుకున్నాడు.

'చెప్పు బాబయ్యా.....'

'నేను చెప్పను.... నాకు తెలీదు.... అయిన ఎంటా వెర్రిమొర్రి ప్రశ్నలు .... త్వరగా తొక్కు, దుక్కలా ఉన్నావ్ అంత మెల్లగా తొక్కుతావేం?'

'తప్పు బాబయ్యా.... అలా అనకూడదు బాబయ్యా.... పోనీ మీ ఇంటిదగ్గర హత్యేదైనా జరిగిందా బాబయ్యా?'

'హత్యా..... ఏమో..... నాకు తెలియదు.... నువ్వు త్వరగా తొక్కు .... వెధవ ప్రశ్నలు నువ్వునూ'

చెప్పు బాబయ్యా'

'నేను చెప్పను.....'

'బాబయ్యా!..... ' బాధగా అరిచాడు రిక్షా వాడు. 'అలాఆ అనకండి బాబయ్యా.... నా ప్రశ్నకి జవాబు చెప్పండి బాబయ్యా......'

'నేను చెప్పను ..... చచ్చినా చెప్పను.... నాకు తెలీదు'.

'నిజంగా తెలీదా బాబయ్యా?.....'

'తెలియదు.'

'అయితే రిక్షా దిగు బాబయ్యా.....'

'ఇంక స్టేట్‌బ్యాంక్ కాలనీ రాందే .....'

'రాకపోయినా దిగు బాబయ్యా..... లేకపోతే షూట్ చేస్తాను.....' రిక్షా ఆపి సీటుమీంచి దిగి అన్నాడు.

'ఏంట్రోయ్ మాటలు మిగులుతున్నావ్?..... ఒళ్ళుబలిసిందా?....' రంకె వేశాడు లావుపాటాయన.

'నేను దిగను.... మా ఇంటిదగ్గర దింపు మర్యాదగా'

రిక్షా వాడు నడుంకి కట్టుకున్న గుడ్డలోంచే పిస్తోలు తీశాడు.

'త్వరగా దిగు బాబయ్యా ....లేకపోతే షూట్ చేస్తాను' అన్నాడు లావుపాటాయనికి గురిపెడ్తు.

లావుటాయన కంగారుగా రిక్షా దిగాడు.

'ఎంతివ్వమంటావ్?.....' వణుకుతూ అడిగాడు.

'ఏమీ ఇవ్వక్కర్లేదులే...నా కళ్ళముందు నుండి తక్షణం వెళ్లిపో బాబయ్యా.... లేకపోతే షూట్ చేస్తాను బాబయ్యా.....'

లావుటాయన కంగారుగా పరుగులాంటి నడకతో అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

మరో రిక్షా వాడు మొదటి రిక్షా వాడికి ఎదురుగా రిక్షా తొక్కుకుని వచ్చాడు.

'ఏమయింది సార్?' అన్నాడు వాడు.

'ఏ ఇన్‌ఫర్మేషన్ దొరకలేదు' అంటూ పెదవి విరిచాడు. రిక్షా వాడి వేషంలో ఉన్న ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్.

'అయినా మీరు రిక్షా వాడి వేషంలో ఇన్వెస్టిగేషన్ చేసేప్పుడు బక్కవాళ్ళని రిక్షా ఎక్కించుకోవాలి కానీ ఇందేంటిసార్?.....' కానిస్టేబుల్ నూటపదకొండు వాపోయాడు బాస్ తెలివి తక్కువతనానికి.

'నువ్వు నోర్మూయ్ ...... లేకపోతే షూట్ చేస్తాను......'

## చెంప చెళ్లుమంది

సాయంత్రం....

ఇందిరాపార్కులో....

రాంబాబు వాచ్‌వంక చూశాడు. టైమ్ సరిగ్గా ఆరుగంటలైంది. అప్పటికల్లా ఎన్నిసార్లు చుశాడో వాచ్‌వంక.

'సరోజ ఇంకా రాలేదు..... ఇప్పుడేగా ఆరైంది .... వస్తుందిలే' అనుకుంటుండగా కాస్త దూరంలో క్రోటన్స్ దగ్గర స్కైబ్లూ కలర్ శారీలో అటుతిరిగి నిలబడి ఉన్న సరోజ రాంబాబుకి కనిపించింది.

అమ్మదొంగా .... ఇక్కడ ఉన్నావా? అని అనుకుంటూ మెల్లగా పిల్లిలా డుగులో అడుగులు వేసుకుంటూ దగ్గరికి వెళ్ళి వెనకనుండి కళ్ళుమూశాడు రాంబాబు.

'హాయ్‌రాజా వచ్చేశావా?.....' అంది ఆమె సంతోషంగా.

'వచ్చేశా రాణీ .....' పరవశంగా కళ్ళు మూసుకుంటూ అన్నాడు రాంబాబు.

మరుక్షణం రాంబాబు చెంప ఛెళ్ళుమంది.

బిత్తరపోయి కళ్ళు తెరిచిన రాంబాబుకి ఎదురుగా కోపంగా చూస్తూ ఆమె నిలుచుని ఉంది.

ఆమె సరోజ కాదు.... మెనకనుండి చూసి సరోజ అని పొరబడ్డాడు తను.

'క్షమించండి .... మిమ్మల్ని వెనకనుండి చూసి నా సరోజని అనుకునీ.... అయామ్ రియల్లీ సారీ.....' రాంబాబు నీళ్ళు నమిలాడు.

ఏంటి లల్లీ.... ఏమైనా ట్రబుల్ ఇస్తున్నాడా?' అంటూ అప్పుడే వచ్చాడు ఒక వ్యక్తి చొక్క చేతులు పైకి మడుస్తూ.

'లేదు లే డార్లింగ్ .... నన్ను ఎవరో అనుకుని పలకరించారట!.....' అంటూ అతని చేయిపట్టుకుని ముందుకు నడిచింది ఆమె.

రాంబాబు ఓసారి చెంప తడుముకున్నాడు.

ఆడాళ్ళు చూడ్డానికి చాలా నాజుగ్గా ఉంటారు. కానీ చేతుల్లో బలం బాగానే ఉంటుంది అనుకున్నాడు రాంబాబు.

అక్కడే ఉన్న సిమ్మెంటు బెంచీమీద కూర్చున్నడు రాంబాబు. మరో అయిదునిముషాలు గడిచాయి......

మరోసారి వాచ్‌వంక చూసి పార్కు గేటువంక చూసిన రాంబాబుకి సరోజ అటువైపుగానే రావడం కనిపించింది.

తఠాలున సిమ్మెంటుబెంచీమీదనుండి లేచి సరోజకి ఎదురువెళ్ళాడు రాంబాబు.

'వచ్చేశావా సరోజా?.... ఎంతసేపట్నుండి నీకోసం ఎదురుచూస్తు న్నానో తెల్సా?' అన్నాడు దగ్గరికి వెళ్ళి ఆమె చేతుల్లోకి తీస్కుంటూ.

ఆమె తీక్షణంగా రాంబాబు ముఖంలోకి చూసింది. రాంబాబు తెల్ల బోయి ఆమె వంక చూసి ఏదో అనేంతలో ఆమె చెయ్యి రివ్వున గాల్లోలేచి రాకెట్ వేగంతో రాంబాబు చెంపని తాకింది.

రాంబాబు బాధకన్నా ఆశ్చర్యం ఎక్కువేసింది.

ఇందాక వెనకనుండి ఆమె ఎవరో అచ్చం సరోజలాగుంది! ఈమె అయితే ముఖంతో సహా అచ్చుగుద్దినట్టు సరోజలాగా ఉంది.

రాంబాబుకి పదిక్షణాలవరకూ ఏమీ కనిపించలేదు రంగురంగుల చుక్కలు తప్ప.

ఒక్కసారి తల విదిలించి చూశాడు.

ఎదురుగా ఆమె కన్నీళ్ళతో కనిపించింది.

'సారీ అండీ....మీ చేతులు పట్టుకుని అల్లరి చేయాలనే తలంపు నాకు లేదండీ....నేను మిమ్మల్ని నా సరోజ అనుకున్నానండీ.... మీరు అచ్చు సరోజలాగా ఉన్నారండీ......అంతేగానీ నేను జులాయి వెధవని కానండీ.....' చెంప రుద్దుకుంటూ అన్నడు రాంబాబు.

'జులాయి అయినా ఫరవాలేదు. నువ్వు చాల ప్రమాదకరమైన మనిషిని .....మోసగాడిని..... నమ్మించి దగా చేసేవాడివి.... తడిగుడ్డతో గొంతులుకోసేవాడివి....'

ఆమె వెక్కివెక్కి ఏడ్చింది.

'పొరబాటున ఒక మనిషిని అనుకుని చెయ్యి పట్టుకున్నంత మాత్రాన మీరు నా గురించి మరీ ఇంతదారుణాంగా అంచనా వేయడం న్యాయం కాదండీ.....జరిగిన పొరబాటుకి చితిస్తున్నాను. ప్లీజ్ ఏడవకండి.....'

'నేను కూడా నిన్ను ప్రేమించినందుకు చాలా చింతిస్తున్నాను' కళ్ళు తుడుచుకుంటూ అంది.

రాంబాబు ఆశ్చర్యంగా చూశాడు.

'మీరు నన్ను ప్రేమించడం ఏమిటీ? ఇంతకీ ఎవరు మీరు?'

'అవునులే కొత్తమ్మాయ్‌ని ఎవర్నో పట్టి వుంటావు! అందుకే నేనెవర్ని అని అడుగుతున్నావు'

'మీరేం అంటున్నారో నాకు అర్థం కావడంలేదు' రాంబాబు బుర్రగోక్కున్నాడు.

'నేను గుర్తులేను.... సరే ..... పోనీ ఈ ఫోటోలోని అమ్మాయి గుర్తుందా రాంబాబూ?'

సరోజ హ్యాండ్ బ్యాగ్‌లోంచి ఒక ఫోటోతీసి రాంబాబుకి చూపించింది.

ఈ ఫోటోని చూస్తూనే రాంబాబు ఉలిక్కిపడ్డాడు.

తన కౌగిట్లో కళ్ళు మూసుకుని ఉన్న నీలిమ!

రాంబాబుకి వెంటనే కళ్ళముందు ఆ రోజు జరిగిన సంఘటన మొత్తం సినిమా రీలులా తిరిగింది.

ఆ రోజు నిలిమ తన స్టూడియోకి వచ్చింది. నికాన్ కెమేరాలో ఫిలి లోడ్‌చేసి ఎలా ఆపరేట్ చేయాలో చూపించమని అడిగింది. తను అన్ని వివరాలు చెప్పాడు. చివరగా సెల్ఫ్ టైమర్ గురించి చెప్పాడు. అప్పుడు నీలిమ సెల్ఫ్ టైమర్ సెట్‌చేసి కెమేరా ముమ్దుకువెళ్ళి నిల్చుంది. హఠాత్తుగా ఆమె కళ్ళు తిరిగి పడిపోతుంటే తను ఆమె పడిపోకుండా పట్టుకున్నాడు. అప్పుడు కెమేరా క్లిక్కుమంది.

అది ఆ ఫోటోనే.....!!!!

'చెప్పు ....నేను సరోజనని గుర్తులేదు.... పోనీ ఈ అమ్మాయి నీలిమ అనైనా గుర్తుందా?.....' సరోజ క్రోధంగా అడిగింది.

రాంబాబుకి నవ్వొచ్చింది.

'అయితే ఈ ఫోటో గురించి సరోజ నువ్వు నన్ను మోసగాడివనీ ప్రమాదకరమైన మనిషివనీ అన్నది? అసలేం జరిగిందంటే ..... ఆ రోజు ఈమె నా స్టూడియోకి వచ్చింది అపుడు ఈమె పేరు కూడా నాకు తెలీదు.....'

'పేరుకూడా తెలీదుగానీ ఆమెను కౌగిలించుకున్నావ్?..... అంతేనా? ఇంక నన్ను నమ్మించడానికి ఏవేవోకట్టు కథలు చెప్పడానికి ప్రయత్నించకు రాంబాబు .... ఈ రోజుతో నీకూ నాకూ చెల్లు....'

'సరూ....' రాంబాబు చేతిని పట్టుకున్నాడు.

సరోజ రాంబాబు చేతిని విదిలించి కొట్టింది.

'నీ మొహంకూడా నాకు చూపించడానికి ప్రయత్నించకు.....గుడ్ బై.......'

'సరూ..... సరూ......' రాంబాబు బాధగా పిలిచాడు. సరోజ విసావిసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

రాంబాబు పచ్చికలో కుప్పకూలిపోయాడు.

## *రాంబాబు నిర్ణయం*

అప్పుడు సమయం రాత్రి సరిగ్గా ఏడు గంటలయింది.

కిష్టయ్య స్టూడియోలో ఫోటోకి టచస్ ఇస్తుండగా గుమ్మంలో అలికిడి అయితే తలెత్తి చూశాడు.

రాంబాబు కళావిహీనంగా వున్న మొహంతో లోపలికి వస్తున్నాడు. కిష్టయ్యకి చాలా ఆశ్చర్యం కలిగింది. సరోజని పార్కులో కలుసుకోవడానికి వెళ్ళిన గురూగారు అప్పుడే వచ్చేశారేంటబ్బా? ఆయన ముఖం చూస్తుంటే జరగదూడనిదేదో జరిగింది అనిపిస్తుంది.

రాంబాబు మౌనంగా వచ్చి కుర్చీలో కూర్చుని రెండుచేతులతో తలపట్టుకున్నాడు.

'ఏం జరిగింది గురూగారు? .....' అడిగారు కిష్టయ్య ఆతృతగా.

రాంబాబు మాట్లాడలేదు.